క్లుప్తంగా

పేదలకు మరిన్ని సేవలు అందించాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): వాసవి క్లబ్ ఇంటర్నేషల్ ద్వారా శ్రీవిశ్వావసు నామసంవత్సరంలో సమాజానికి మరిన్ని సేవలు అందించాలని క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు. ఉగాదిని పురస్కరించుకుని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 212 ఆధ్వర్యంలో గొల్లపూడిలోని శ్రీదత్త కల్యాణమండపంలో పలువురు ప్రముఖులు, క్లబ్ సభ్యులను సత్కరించారు. జిల్లా గవర్నర్ తూనుగుంట్ల శ్రీధర్ నేతృత్వంలో నగర ప్రముఖులు చలువాది మల్లికార్జున రావు, గడ్డం సత్యనారాయణ, న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, లక్ష్మిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాసుదేవ రావు, శారద, రోజా, నందిపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రంజాన్‌ను పురస్కరించుకుని బీజేపీ ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి అవ్వారు బుల్లాబ్బాయ్ ఆధ్వర్యంలో 46వ డివిజన్ ఫైర్‌స్టేషన్ ఎదుట అప్పికట్ల జోసఫ్ వీధిలో సోమవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలనే భావనతో తోఫాను పంపిణీ చేసినట్లు వివరించారు. ఉమాకాంత్, దేవిన హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 38వ డివిజన్ కొట్టేటి కోటయ్య వీధిలోని శ్రీసీతారాముల దేవస్థానంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయ పునర్నిర్మాణానికి గత ప్రభుత్వంలో అప్పటి దేవదాయశాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు రూ.22లక్షలు మంజూరు చేయించగా, పనులు పూర్తిచేశారు. విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా అర్చకులు కప్పగంతు సీతారామాంజనేయ శర్మ (రాంబాబు), అగ్నిహోత్రం వంశీ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యావహం, రత్న న్యాసం, శిలాబింబ-శిఖర స్థాపన చేశారు. అనంతరం శ్రీహనుమత్ సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్ర స్వామి విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

ఆలయ ధర్మకర్త యండూరి వెంకట సూర్యనారాయణ కుటుంబసభ్యుల నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, మైనార్టీ రాష్ట్ర నాయకుడు షేక్ హయాత్‌షరీఫ్, ఆలయ కమిటీ సభ్యులు ఉడుముల అయ్యప్పస్వామి, పీ మారుతీరామ్, దుర్గాప్రసాద్, స్థానిక పెద్దలు కర్రి మల్లికార్జున రావు, ఆర్.విజయ్, పేడాడ రామయంద్రరావు, బడుగు చిన్న, దాసరి శేఖర్, వినోద్ పాల్గొన్నారు.

ముగిసిన ఈశ్వరమ్మతల్లి ఉగాది సంబరాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీ ఈశ్వరమ్మ అమ్మవారి ఉగాది సంబరాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం దాత రుద్రరాజు వెంకట సుబ్బరాజు దంపతులచే భారీ అన్న ప్రసాద వితరణజరిగింది. సుమారు మూడు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి అమ్మవారి ప్రసాదంను స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు సామంతపూడి చిన్నా పాల్గొని స్వయంగా భోజనాలు వడ్డించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పీవీ సుబ్బరాజు, దాట్ల శివరామ రాజు, ఐఎస్ఎన్ రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆసిఫ్



సరాయి మసీదు ప్రార్థనల్లో పాల్గొన్న వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, ముస్లింలు



మసీదు వద్ద షేక్ బషీర్‌ను సత్కరిస్తున్న స్థానికులు



పాయసం పంపిణీ చేస్తున్న ఉమర్ ఫారూఖ్ సిద్ధిక్, ఎస్‌కె బాజీ, దుర్భేసుల హుస్సేన్



ప్రసంగిస్తున్న మత గురువు ఇమాం హాజీ గోహర్ ఆలం



ప్రార్థన చేస్తున్న కార్పొరేటర్ ఇర్ఫాన్, పలువురు ముస్లింలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో ముస్లింలు నివసించే వించిపేట, తారాపేట, ఇస్లాంపేట తదితర ప్రాంతాల్లో రంజాన్ పర్వదినాన్ని సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. వన్‌టౌన్‌లోని ఆయా ప్రాంతాల్లోని మసీదుల్లోనూ ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇస్లాంపేటలోని మీనార్ మసీదు, తారాపేటలోని పెట్రోల్‌బంక్ వద్ద ఉన్న మసీదుతో పాటుగా, ఇందాద్‌ఘర్ వద్ద ఉన్న సరాయి మసీదు, కెనాల్‌రోడ్డులోని జామియా మసీదు, మొయిన్‌బజార్‌లోని పలు మసీదుల్లో నిర్వహించిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొని నమాజ్ చేశారు. అనంతరం ఆలింగనం చేసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రపంచ శాంతి వర్ధిల్లాలి..

ప్రపంచంలో శాంతి వర్థిల్లాలని వించిపేట షాహీ మసీదు ఇమామ్ ఖదీర్‌నయీమి అన్నారు. వించిపేట షాహీమసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం ఉదయం మూడు దఫాలుగా ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్ ఖదీర్‌నయీమి మాట్లాడుతూ రంజాన్ మాసం పరమ పవిత్రమైదన్నారు. ప్రధానంగా పేదల ఆకలిదప్పికలను పంచుకోవాలని రంజాన్ సూచిస్తుందని చెప్పారు. నమాజ్ పూర్తవ్వగానే ముస్లింలు ఒకరికొకరు శుభాకంక్షలు చెప్పుకున్నారు.

గాంధీజీ హైస్కూల్ ప్రాంగణంలో.....

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మార్కజ్ జామియా మసీదు అహ్లు ఆదీస్ ఆధ్వర్యంలో గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు ఇమామ్ అబూ హురైరహ్ మదని రంజాన్ సందేశాన్ని అందిస్తూ సర్వమానవాళి సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇస్లాం అందరికీ మంచిని బోధిస్తుందన్నారు. తోటి మానవుడితో మార్యాదగా వ్యవహరించాలని సూచిస్తుందన్నారు. కేవలం రంజాన్ మాసంలోనే కాకుండా ఆ తరువాత సైతం ఆ నియమాలను పాటించి అల్లా అనుగ్రహాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రార్థనల కమిటీ అధ్యక్షులు యూసుఫ్ ఖాన్, కార్యదర్శి ఫారూఖ్ ఖాన్, మసీదు ప్రముఖులు అల్తాఫ్, రీజవానుల్లా తదితరులు పాల్గొన్నారు.

అల్లా చల్లని దీవెనలు అందరిపై ఉండాలి

అల్లా చల్లని దీవెనలు మానవాళి అందరిపై ఉండాలని మత గురువు ఇమామ్ మహ్మద్ అబ్దుల్ రఫి ఆకాంక్షించారు. వన్‌టౌన్ కాశేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లోని సరాయి మసీదులో సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వక్ఫ్ బోర్డ్ జిల్లా ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాజా మస్తాన్, సరాయి మసీదు మేనేజర్ సయ్యద్ అంజుమ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇమామ్ అబ్దుల్ రఫి ఈద్ నమాజు చదివి సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ అల్లా చూపిన మార్గంలో నడవాలని, ఎదుటివారి పట్ల ప్రేమ, దయ, కరుణ, క్షమా గుణం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

మానవుల మధ్య ప్రేమ వర్థిల్లాలి: ఆసిఫ్

మానవుల మధ్య ప్రేమ వర్థిల్లాలని ఇస్లాం చెబుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్వైజరీ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్ అన్నారు. పాతబస్తీ, వించిపేట తదితర ప్రాంతాల్లో జరిగిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తోటి మానవుడికి ప్రేమను పంచమని సమాజానికి మేలు చేయాలని ఇస్లాం బోధిస్తుందన్నారు. . రంజాన్ మాసంలో కఠోర నియమాలను ఆచరించడం ద్వారా చక్కని జీవన విధానాన్ని అలవరచుకోవచ్చని ఆయన వివరించారు.

ప్రత్యేక బందోబస్తు...

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయా మసీదులు, ప్రధానకూడళ్ల వద్ద ఆదివారం రాత్రి నుంచి పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ప్రధానంగా కాశేశ్వరారావు మార్కెట్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో మూడు మసీదులు ఉండటంతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్ అధికారులు ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి బందోబస్తు చేపట్టారు. వించిపేటలోని పంజా సెంటర్ తదితర ప్రాంతాల్లో కొత్తపేట పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. తారాపేట, ఇస్లాంపేటలోని మినార్ మసీదుల వద్ద కూడా పోలీసు బందోబస్తును నిర్వహించారు.

రజా మసీదులో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని భవానీపురం స్వాతీ సెంటర్‌లోని రజా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా మతగురువు ఇమాం హాజీ గోహర్ ఆలంమాట్లాడుతూ రంజాన్ మాసపు పుణ్య దినాలలో కఠోర దీక్షల ద్వారా క్రమశిక్షణ, ఆధ్యాతిక చింతన, దాతృత్వం అలవాటవుతుందన్నారు. మహ్మద్ ప్రవక్త బోధనలను ప్రతి ముస్లిం అనుసరించి జీవితాన్ని సార్ధకం చేసుకోవాలని సూచించారు. రజా మసీదు కమిటీ సభ్యులు, 41వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ మహ్మద్ ఇర్ఫాన్, కలీం, సాధిక్, ఖాన్, అల్లా భక్షు, ముతవల్లి నస్రత్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం..

భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని మక్కా మసీదు వద్ద ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ముస్లింలు ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు షేక్ బషీర్‌ను సత్కరించి మిఠాయిలు తినిపించారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ తరతమ బేధాలు లేకుండా స్థానికులంతా ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేయడంతో మతసామరస్యం వెల్లివిరిసింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు దాసి జయప్రకాష్ కెనడి, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు, లేళ్లపూడి లాజర్, ఏలూరు వెంకన్న, పెదబాబు, మాగం ఉమ, సురభి వెంకట్రావు, రాచమళ్ల సుధాకర్(సబ్బుల్స్), అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

గొల్లపూడి పంచాయతీ పరిధిలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): సర్వ మానవాళి శాంతిసౌఖ్యాలతో విలసిల్లాలని కోరుతూ గొల్లపూడి పంచాయతీ పరిధిలోని హెచ్‌ఓ కన్వెన్షన్ హాల్ అధినేత దుర్బేసుల హుస్సేన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈదుల్ ఫితర్ నమాజు కార్యక్రమంలో మౌలానా ఉమర్ ఫారూఖ్ సిద్దిక్ రంజాన్ సందేశాన్ని అందజేశారు. బీజేపీ రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ బాజీ మాట్లాడుతూ స్నేహ సౌభ్రాతృత్వాలు పెంపొందించే రంజాన్ మాసం పర్వ దినాలు జీవిత పరమార్థాన్ని తెలియ చేస్తాయన్నారు. స్నేహం, ఆప్యాయత, ఆత్మీయతతో తోటివారిపట్ల ప్రేమ కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు, హెచ్‌ఓ కన్వెన్షన్ హాల్ అధినేత దుర్బేసుల హుస్సేన్ మాట్లాడుతూ హిందూ ముస్లిం భాయి భాయి అన్న నినాదం మేరకు కొన్ని దశాబ్దాలుగా అందరూ కలిసి మెలిసి ఉంటూ మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నారని అన్నారు. గత నాలుగేళ్ల నుంచి ప్రతి ఏటా తమ హెచ్‌ఓ కన్వెన్షన్ హాల్‌లో రంజాన్, బక్రీద్ ప్రార్థనలు నిర్వహిస్తున్నందుకు గర్వకారణంగా ఉందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుర్బేసుల ఖాసీం సోదరుల ఆధ్వర్యంలో పాయసం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ మీర్ హుస్సేన్(మున్నా), అలుగుండ్ల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోతీ మసీదులో సామూహిక ప్రార్థనలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 10 గంటలకు చిట్టినగర్ మోతీ మసీదు ఈద్గామ హాల్‌లో ఇమామ్ నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనలకు చిట్టినగర్, అలీనగర్, వించిపేట, పంజా సెంటర్, భవానీపురం, గొల్లపూడి ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు హాజరయ్యారు. తొలుత ఇమామ్ నజీర్ అహ్మద్ రంజాన్ పండుగ విశిష్టత గురించి వివరించారు. సామూహిక ప్రార్థనల్లో జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ ఛైర్మన్ షేక్. గౌస్‌మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు పోతిన మహేష్ పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక నమాజ్ సందర్భంగా ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా వెస్ట్ ఏసీపీ దుర్గారావు, కొత్తపేట సీఐ కొండలరావుతోపాటు పెద్ద ఎత్తున సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నల్లరిబ్బన్లు, ప్లకార్డులతో నిరసన...

వక్ఫ్ సవరణ చట్టం 2024ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ముస్లింలు నల్ల రిబ్బన్లు, ప్లకార్డులను పట్టుకుని సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆలిండియా ముస్లీం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు పెద్ద ఎత్తున ముస్లిం పెద్దలు, యువకులు తమ చేతికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నమాజ్ చేశారు. అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేశారు. ముస్లిం ఆస్తులను కబళించే దుర్మార్గపు చర్యలకు కూటమి ప్రభుత్వం తెరలేపిందని పేర్కొన్నారు.

గులాబీలు, కనకాంబరాలతో అర్చన



పుష్పార్చనను వీక్షిస్తున్న ఉభయదాతలు, భక్తులు



అమ్మవారికి కనకాంబరాలతో అర్చన నిర్వహిస్తున్న అర్చకులు



పుష్పార్చన నిమిత్తం పూలను తీసుకువస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు గులాబీలు, కనకాంబరాలతో అర్చన చేశారు. అర్చన నిర్వహించే పుష్పాలతో ఆలయ డీఈవో రత్నరాజు, ఆలయ అర్చకులు, భక్తులు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఉదయం 9 గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి మూలవిరాట్‌కు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం పుష్పార్చన జరిగే పూజా మండపానికి చేరుకున్నారు. పూజా మండపంలో ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు విశేష పుష్పార్చన చేశారు. పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం పూజకు ఉపయోగించిన పుష్పాలను భక్తులకు పంపిణీ చేశారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి తెలిపారు. సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద సోమవారం సాంస్కృతిక, కళారంగాలకు చెందిన వారికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని చెప్పారు. ఉగాది పురస్కారాల్లో సాంస్కృతిక, కళారంగాలు, గాయనీ గాయకుల విభాగాన్ని చేర్చి వారికి కూడా ఉగాది పురస్కారాలు ఇవ్వాలని సూచించారు. జ్యోతిష్యశాస్త్ర వేత్త ప్రసూనా రామన్ కళాపీఠం చేస్తున్న కృషిని అభినందించారు.

చింతకాయల చిట్టిబాబు, గుడిపాటి హరికృష్ణ, శ్యాంప్రసాద్, బీవీ వీరభద్రరావు దేవిడ్‌రాజు, సత్యవర్ధన్, ఆదిరాల జయప్రభ, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి, తబలా చిట్టిబాబు, కొప్పుల అశోక్, చావా నరసింహారావు, కారుమంచి రాజు, అమాలారాణిలను సత్కరించారు.

కేంద్రం మైనార్టీల హక్కులను హరిస్తోంది



కుమ్మరిపాలెం సెంటర్‌లోని తాజ్ మసీదు వద్ద నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వక్ఫ్ చట్ట సవరణ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల హక్కులను హరిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు షేక్ హయాత్ షరీఫ్ పేర్కొన్నారు. వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ పలువురు ముస్లిం మైనార్టీలు విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని తాజ్ మసీదు వద్ద చేతులకు నల్లరిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా హయాత్ షరీఫ్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను రక్షిస్తామంటూనే వక్ఫ్ చట్ట సవరణలను చంద్రబాబు కూటమి ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం దుర్మార్గం అన్నారు. టీడీపీ వక్ఫ్ చట్ట సవరణలను వ్యతిరేకించి తన లౌకికతత్వాన్ని రుజువు చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యావత్ ముస్లిం సమాజం వక్ఫ్ చట్ట సవరణలపట్ల తీవ్ర అభ్యంతరాలను తెలుపుతూ నిరసన ప్రదర్శనలు చేస్తుంటే చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. పైకిమాత్రం ముస్లిం మైనార్టీలపై ప్రేమాభిమానాలు ఉన్నట్లు బిల్డప్‌లు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారం కోసం దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం చంద్రబాబు నైజమని విమర్శించారు. ఇప్పటికైనా వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాజ్ మసీదు కమిటీ సభ్యులు సర్దార్, కాశీం, అబ్దుల్ రవూఫ్, ఎస్‌కె నజీర్, ఎస్‌కె ఇర్ఫాన్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చారిత్రాత్మక మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేలాది మంది ముస్లింలు ప్రార్థనలకు హాజరయ్యారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చిన్నారులు సైతం పాల్గొన్ని ఎంతో భక్తితో ప్రార్థనలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఇందిరాగాంధీ స్టేడియం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ముస్లింలు



వన్‌టౌన్ చిట్టినగర్ మోతీ మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు



చిన్నారులను ఒడిలో కూర్చోబెట్టుకొని ప్రార్థన చేస్తున్న దృశ్యం



చిట్టినగర్ మోతీ మసీదులో నమాజ్ చేస్తున్న చిన్నారులు